
# వెయిట్ ఫర్ దిబెస్ట్ !


## వి.వి.యస్. అచ్యుతవల్లి



అనంతం బట్టలు సర్దుతున్నాడు. భార్య వెనకాల నించుంది. తలెత్తి చూశాడు. విమల ముఖం ప్రసన్నంగాలేదు. ధుమ ధుమ లాడుతూ వుంది. ఈ పదిరోజులు నుంచీ మడులూ, స్నానాలూ అంటూ విమ లకు క్షణం విశ్రాంతి లేకుండా వుంది. అనంతం తండ్రి వీరభద్రయ్యగారు శత వృద్ధుడు. అనంతంకాక ఇంకా ఇద్దరు మగ పిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలూ వున్నారు అనసూయమ్మగారు బ్రతికుండగానే ఆడ విమల. మూతీ ముక్కు ఎరుపెక్కాయి ఆవిడకు. అనంతంకు కష్టంవేసింది. ఎంతయినా కన్నతండ్రి! అందులో అనంతం తొలిచూలు బిడ్డేమో ఒక్క పిసరు ప్రేమాదరాలు తల్లి తండ్రులు

పిల్లలకీ, మగపిల్లలకీ పెళ్ళిళ్ళూ, పేరంటాలూ చేసేశారు. భార్యపోయినా వీర భద్రయ్యగారు రిటయిరయిన వూళ్ళోనే స్వంతఇల్లు కట్టుకుని "నారాయణ" అనే ఒక బీద యువకుడ్ని సాయంగా అట్టె పెట్టుకుంటూ వుండేవారు. "నీ బట్టలుఅన్నీ సర్దేశావా?" అన్నాడు, అనంతం భార్యని కబుర్లలోకి దించాలని.

"ఆఁ. ఏమున్నాయి సర్దటానికీ: వజ్రాలూ, వైఢూర్యాలూ దాచి వుంచాడా మీ ముసలాయన!" ఈసడింపుగా అంది




నించి ఎక్కువగానే నొల్లుకున్నాడు.

"విమ్మీ! నీ కోసం ఇంటికి పెద్ద కోడలువని వజ్ర, వైఢూర్యాలు దాచలేక పోయినా నెలకు రెండు వేలు సంపాదించి పోయేలాగా నన్ను తయారు చేసి నీ చేతుల్లో వుంచారు" అన్నాడు.

"అందుకనేకదా ఇంటిలో వున్నదంతా మన నెత్తిన రుద్దారు?" అంది,

"మన కర్తవ్యం అది. విమ్మీ! ఆయన వున్నన్ని రోజులూ నేను ఎంత పెద్ద వాడ్ని అయినా నా మనసుకు నేను చిన్న వాడిని అనిపించేది. ఈ పది రోజుల్లో నాకు వయోభారం పదింతలు పెరిగినట్లు అనిపించుతోంది,"అన్నాడు బాధగా. అనంతం భార్యతోవచ్చి నెలరోజులుపైగా అవుత్రోంది. వీరభద్రయ్యగారికి సీరియస్‌గా వుందని నారాయణ టెలిగ్రాం ఇవ్వగానే భార్యను తీసుకుని వచ్చేశాడు. అనంతం వచ్చేసరికే వీరభద్రయ్యగారికి బాగా సీరియస్‌లోకి వెళ్ళిపోయింది జబ్బు. హాస్పిటల్‌లో జేర్పించాడు నారాయణ. అనంతం వచ్చిన నాలుగురోజుల్లో ఇద్దరు తమ్ముళ్లూ, చెల్లెళ్లూ, భర్తలతో భార్యలతో వచ్చేశారు. నారాయణ, వీరభద్రయ్యగారికి జబ్బుచేసి నప్పట్నుంచీ ఒక్కచేతితో అల్లా ఆయనకు కావల్సిన మందులు, జావలు, పాలూ, పళ్లూ అన్నీ చూస్తూచేస్తూ వున్నాడు. కోడళ్లూ, కూతుళ్లూకావల్సినవివండుకుతింటూ రెండు పూటలా షికారుగా హాస్పిటల్‌కివెళ్ళి ముసలాయనని చూసివస్తూవుండేవారు. అనంతం తమ్ముళ్ళు ఒకవారం రోజులు ముసలాయనకి ఆదుర్దాతో ఒకళ్ళువిడచి ఒకళ్ళుసేవలు చేస్తూ వుండిపోయేవారు. ముసలాయనకి కంటి చూపులేదు. మాటలేదు. ఏదో తపస్సు చేస్తూన్నట్లు పరుగల్లె మంచానికి అంటుకుపోయివున్నాడు. ఎవరు వస్తున్నారో, ఎవరు వెళుతున్నారో ఆయనకేమీ సంబంధం లేదు. తన బొజ్జమీద పడుకోబెటుకుని, చందమామని చూపిస్తూ కథలు, కబుర్లు చెబుతూండే తండ్రి దీనావస్థ అనంతాన్ని కదిలించింది. మానవులకు చరమదశ. వాళ్ళు ఎంత మహానుభావులయినా నడివయస్సులో ఎంత ఉన్నత శిఖరాలని అధిరోహించినా, చేసేవాళ్ళకు చూసే వాళ్ళకు. ఒక చిన్నచూపుగానే వుంటుంది. ఏది చెప్పినా, చేయబోయే వాళ్ళకు, వయసు వాళ్ళకు.

"ఆఁ ముసలాళ్లు ఏవో చాదస్తం కబుర్లు చెప్తారు." అన్పించుతూ వుంటుంది.




పెద్దవాళ్ళు ఎన్నెన్నో జీవితానుభవాలు చవిచూసి వుంటారు. వాళ్ళు అనుభవించిన అవస్థలు చిన్నవాళ్ళకు రాకూడదనే వాళ్ళ అనుభవాల సారం చెబ్తూ వుంటారు. కాని చిన్నవాళ్ళకు అవన్నీ ముసలి కబుర్లలా కనపడతాయి. అనంతంకు తన చిన్నతనం కళ్ళకు కట్టినట్లు కన్పించింది. అతని కేది కావాలంటే అది క్షణాల్లో అమర్చేవారు వీరభద్రయ్యగారు. ఆయన చేయెత్తు మనిషి! గంభీరంగా వుండేవారు. గ్రాడ్యుయేటు అయినాడు అనంతం, తల్లి బి. ఇడి. చేసి వున్న వూళ్ళోనే టీచర్‌గా చేరమంది, వద్దన్నారు వీరభద్రయ్యగారు.

"ఇంటికి పెద్దవాడు అనంతం. మనకు పెద్దకాలంలో చేతికి ఆసరాగా వుంటాడు. దగ్గరే వుంచుకునే ఏర్పాటు చేయండి" అన్నది అనసూయమ్మ.

"వాడి తర్వాత ఇద్దరున్నారు. పెద్దవాడే చదువాపేస్తే, ఇంక చిన్నవాళ్ళకు ఆసక్తి వుండదు. వాడ్ని కాశీ పంపుతాను బి. ఇ. చదువుతాడు. అన్నగారు పెద్ద చదువు చదివితే పిల్లలకు కూడా పెద్ద చదువులు చదువుకోవాలనే పోటీ వస్తుంది. "స్పర్థయా వర్థతే విద్యా" అన్నారు పెద్దలు."అన్నారు. "ఇంతింతై వటుడింతై" అన్నట్లు. ఆయన ఉత్సాహంగా చదువుకో అన్నకొద్దీ అనంతంకు కూడా చదువుమీద బాగా శ్రద్ధపుట్టి. అన్ని పరీక్షలూ క్లాసులో ఫ్యాసయినాడు. అన్నగారు చదువుతున్నాడనే పట్టుదల కొద్దీ తమ్ముళ్ళుకూడా బాగా పెద్ద చదువులు చదివారు. చెల్లెళ్ళకి మంచి మంచి సంబంధాలు చేశారు. అంతా సుఖంగా ఎవళ్ళ సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నారు.


అనసూయమ్మగారు పోయినాక కూతుళ్ళూ, కొడుకులూ తమ వద్దకు వచ్చి వుండమంటే తమ వద్దకు వచ్చి వుండమంటూ పోటీలు పడ్డారు.

"ఎటూ నారాయణ వుంటున్నాడు కదా! మే మిద్దరం ఏదో కాలక్షేపం చేస్తాం. మీ కందరికీ బర్డెన్‌గా ఎందుకు?" అన్నాడు వీరభద్రయ్యగారు. అన్నతమ్ములు, అక్క చెల్లెళ్ళు ముఖముఖాలు చూసుకున్నారు. కంటికి రెప్పలా పెంచారు. పెద్దను చేశారు. వాళ్ళు సుఖంగా సంసారాల్లో కుదురుకునేట్లు చూశారు. అయితే వీరభద్రయ్యగారి పిల్లలవద్ద ఆఖరిదశ గడపాలని లేదా? తన రక్తం పంచుకు పుట్టిన తనచేతుల్లో అపురూపంగా పెరిగిన పిల్లలవద్ద విశ్రాంతిగా, సుఖంగా వుండాలని లేదా? ఏది ఏమయినా తండ్రి తమ పంచల చేరకుండా స్వతంత్రంగా వుండటం పిల్లలకు ఏమీ నచ్చలేదు. నారాయణ ఏదో బట్టలకొట్లో గుమాస్తాగా వుండేవాడు. ఒక కాలు అవిటిగా వుండేది. ఈడుస్తూ నడిచేవాడు. బట్టల కొట్లో ఇచ్చే అరవయి రూపాయలూ వీరభద్రయ్యగారి చేతికిచ్చేసేవాడు. నెల రోజులనాడు.

"నువ్వు మాత్రం ఎన్నిరోజులుంటావు! పెళ్ళి పేరంటం చేసుకుంటే నీ భార్య పటుకు ముసలాయనకు చేయగలదా!" అన్నాడు అనంతం నారాయణతో. నారాయణ నెమ్మదస్తుడు, మాటకారి కాడు. నవ్వేసి వూరుకున్నాడు. అప్పుడప్పుడువచ్చి చూసిపోతూవుండేవారు పిల్లలు. అందరికీ సెలవలుపెట్టి ఎక్కడన్నా హాయిగా పది రోజులుండాలి అనిపించితే చటుక్కున తండ్రి గుర్తుకువచ్చేవాడు. మగపిల్లలూ, ఆడపిల్లలూ కూడా వాళ్ళవాళ్ళ నిత్యజీవితాలతో విసుగెత్తిపోతే తండ్రివద్దకు వచ్చి పది రోజులు, నెలరోజులూవుండి వెళ్ళిపోతూండేవారు. ఎవరు వచ్చినా నారాయణ అగ్గగ్గలాడుతూ అన్నీ అమర్చిపెట్టేవాడు. వీరభద్రయ్యగారు ఒక్కొక్కప్పుడు నవ్వేవారు. పిల్లలని దగ్గరకుపిల్చి:

"ఏమర్రా! ఆరోజు మీవద్దకు రానంటే ముఖాలు ముడుచుకున్నారు. మీకు రొటీన్ లైఫ్‌తో విసుగెత్తిపోయినప్పుడు రావాలంటే నేను లేకపోతే మీరు ఎక్కడికి వెళ్ళేవారు?" అనేవారు.

"బాగుంది. మిమ్మల్ని చూడాలని వచ్చేము. మీరు మాతో వుంటే ఏ తిరుపతో, కంచో లేకపోతే బొంబే, కలకత్తా లాంటి పట్టణాల్లో తిరిగివస్తాము. మీరు ఒక్కరూ ఇక్కడ వుంటే మాకు అక్కడ ఏమన్నా తోస్తుందా?" అనేవారు. పిల్లలు.




సింహాచలం-వరాహమూర్తి

చిత్రం : వి. కామేశ్వరరావు, విజయవాడ

అనంతం ఎంత పట్టుపట్టినా వీరభద్రయ్యగారి మనసు మార్చలేకపోయేడు.

"అందరూ మమ్మల్ని అంటారు నాన్నగారూ! ముగ్గురు మగ పిల్లలుండీ. ...ంచుతూ అజ్ఞానవంతులై వుండీ తండ్రిని ...దూరంగా వదిలేశారు అనుకుంటారు." అన్నాడు అనంతం.

"ఎవరో ఏదో అనుకుంటోంటే మనం

ఆకారం పూర్తిచేసి
  అడ్డంగా గీతలు గీసి
విలాసం పూర్తిచేసి
బొక్సులో పడేస్తాడు బ్రహ్మదేవుడు.

ముఖానో ముద్రవేసుకొని
బ్యాగుల్లో తిరుగుతూ
ఎండల్నీ, వానల్నీ చవిచూస్తూ
ఒత్తిడిలో నలుగుతూ
ఏ కొండనో, కోననో చేరేసరికి
పూర్తవుతుంది ప్రయాణం
పోస్టు కార్డు జీవితం

అక్కడో "కన్ఫర్మేషన్" ముద్ర - అదే
  ఆఖరు
మోసుకెళ్తాడు కింకరుడు - నౌఖరు
బట్వాడా మాత్రం - ఖరారు.

— ములుమూడి ప్రసాదరావు

మయూరం పురివిప్పి ఆడుతూ
  క్రేంకారాలతో ఆడ నెమలిని
    ఆకర్షిస్తుంటే

వర్షం వస్తుందని ఆశగా యెదురు చూస్తారు!
చివురాకులు మెక్కి మత్తెక్కిన కోయిల
ప్రియునికోసం గొంతెత్తి కూస్తే

  వసంతం వచ్చేసిందని విసుపోతారు!
కడుపు నిండిన లేగదూడ
ఆనందంతో గెంతుతూ అంబా అని అరిస్తే
జాలిగా బుజ్జగించి చిగురాకులు
    నోటి కందిస్తారు :


కాని సాటి మనిషి
ఆకలేసి కేకలేస్తే
తరిమి తరిమి కొడతారు,
    పట్టి జైళ్ళలో తోస్తారు !

— కె. శ్రీరాములు

ఏమీ చేయలేము. మన మనస్సుకి నచ్చి నట్టు మనం నడుచుకుంటాము. మిమ్మల్ని పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించటం నా కర్తవ్యం! అందుకు ప్రతిఫలంగా జీవితం అంతా మిమ్మల్ని పట్టుకు వేలాడా లని నాకేమీ లేదు. పిల్లల్ని కన్నప్పుడు వాళ్ళు స్వయంపోషకంగా వుండేట్లు తయారుచేయటం తల్లిదండ్రుల బాధ్యత! గేదెలు, ఆవులు పాలిచ్చి దూడలను పెంచు తాయి. పక్షులు. సమస్త జంతుకోటి తమ తమ సంతానాన్ని వాట్ల వాట్ల ఆహారాన్ని అవి సంపాదించుకొనేదాకా జాగ్రత్తగా సాకుతాయి. వృద్ధాప్యదశలో ఏ పక్షులు అయినా పశువులయినా తమ తమ సంతా నాల ఆలంబన కోరుతున్నాయా? మానవు లకే ఎందుకు ఈ ఆలంబన?" అన్నారు. వీరభద్రయ్యగారు.

"బాగుందండీ! వృద్ధాప్యంలో పిల్లలు చూడకపోతే ఎవరు చూస్తారండీ! పిల్లలుండీ ఎందుకు ఒంటరితనం" అన్నాడు అనంతం. విరక్తిగా నవ్వారు వీరభద్రయ్యగారు.

"ఒక విత్తనం మొక్క అవుతుంది. రెమ్మలు, కొమ్మలూ బలిసి మహావృక్ష మవుతుంది. పూలు పూస్తుంది. కాయలు కాస్తుంది. పళ్లు పండుతుంది. ఆ పండు లోంచి మళ్ళీ విత్తనాలు పుట్టుతాయి. మళ్ళీ ఇంకో మొక్క అవుతుంది. ఇదంతా సృష్టిలో ఒక వింతయిన చక్రభ్రమణం! సమస్త ప్రకృతి ముందుకే జరుగుతుంది కాని, ఒక్క లిప్త అయినా వెనక్కి జరు గదు. మీరు పెద్దవాళ్లు అయినారు. మీరు తిని పదిమందికి పెట్టగల స్తోమతు సంపా దించుకున్నారు. నాకు కొద్దోగొప్పో పెన్షన్ డబ్బులు వస్తున్నాయి. నారాయణ బీద వాడు. అవిటివాడు. పెద్ద చదువు లేదు. అతనికి కొంచెం సుఖంగా రోజులు వెళ్లా



లంటే ఎవరిదో ఒకరిది ఆలంబన అవసరం. నాకుతోడు అతనుంటాడు. అతనికి నీడగా నేనుంటాను. ఇద్దరం మగవాళ్ళం కాబట్టి ఎలావున్నా జరిగిపోతుంది" అన్నారు వీరభద్రయ్యగారు.

"నాన్నగారు తన పంతం నెరవేర్చుకున్నారు. తను పుట్టి పెరిగిన వూళ్ళో తను ఎవరి ఆధారమూ కోరకుండా బ్రతికున్నన్ని రోజులూ తానే ఒకరికి ఆధారంగా బ్రతికారు" అనుకున్నాడు అనంతం. ముందు వారం పది రోజులు పిల్లలంతా హాస్పిటల్ చుట్టూ ఆదుర్దాగా తిరిగారు.

"తగ్గుతుందంటావా! మళ్ళీ మనలోకి వస్తారంటావా!" అంది పెద్ద చెల్లెలు ఒక రోజున.

"అసలు మన స్పృహే లేదు. మా ఆయన్ని కూడా ఆనమాలు పట్టలేదు. ప్చ్!" అంది చిన్న చెల్లెలు.

"అన్నయ్యా! నేను పదిరోజులే సెలవు పెట్టాను. ఆయనకి తగ్గే సూచనలు కనపడటంలేదు. ఏం చేద్దాం! నాకు ఎర్నెడ్ లీవ్ అంతా ఎప్పుడో అయిపోయింది" అన్నాడు పెద్ద తమ్ముడు.


"పోనీ టాక్సీ మీద మా ఇంటికి తీసుకుపోదాము. మీ అందరికన్నా మా వూరే కదా కాస్త దగ్గరగావుంది" అన్నాడు చిన్న తమ్ముడు. అతనుండే పట్టణం నూట యాభయి మైళ్ళ వుంది వీరభద్రయ్యగారి వూరుకు!

"ఎందుకు? మీ దగ్గరకు రావాలన్నా మాకు మూడురోజుల ప్రయాణం తప్పదు. మాతో తీసుకుపోతే నయం. పెద్దమ్మాయి పురిటి రోజులు. ఒక్కర్తె ఏం తంటాలు పడుతోందో ఏమిటో!" అన్నది. పెద్ద కోడలు విమల.

"ఆయన స్పృహలో వుండగా ఎక్కడికీ వెళ్ళటాని కిష్టపడలేదు. ఈ స్థితిలో ఆయన్ని స్థలం మార్చటం ఆయన కోరికని కాదనటమే అవుతుంది. నేనున్నాను కదా! నాలుగురోజులు నిలకడ చూసుకుని మీ మీ పనులు చక్కబెట్టుకుని రండి!" అన్నాడు నారాయణ బాధగా.

"ఇన్నాళ్ళూ అంటే ఆయన దృఢంగా తిని తిరిగేవారు కనుక, అలా ఒంటరిగా వదిలేసినా లోకం వూరుకుంది. ఇప్పుడు మాకు పనులున్నాయంటే, మాకు పనులున్నాయంటూ నలుగురూ జారుకున్నారంటే దోసిళ్ళతో ముఖాన దుమ్మెత్తిపోస్తారు లోకులు అంది, చిన్నకోడలు 'రజని.'

"ఒకళ్ళు దుమ్మెత్తిపోస్తా రనేమిటి! ఈ దశలో కొడుకులు దగ్గ రుండటం ముఖ్యం! మనకీ పెద్దతనాలు వస్తాయి. ఎప్పుడూ ఇలాగే వుండిపోము. నాలుగు రోజులు కష్ట నష్టాలకి ఓర్చుకోకపోతే మాతా పితృ ఋణం తీరేదెట్లాగు?" అంది మూడోకోడలు లలిత. అనంతంకు మనస్సులో ఏదో కించ కలిగింది. తాపం దయావున్నారు, వండుకుంటున్నారు. తింటున్నారు తిరుగుతున్నారు. అయినా భరించలేనంత వెల్తిగా వుంది. ఆ వెల్తి ఎవరూ పూడ్చలేనంత అగాధంగా వుంది. కాఫీ చూస్తే ఎవరన్నా త్రాగుతుంటే తనూ ఒక కప్పు త్రాగుతున్నాడు. అన్నంలో అన్ని రకాల ఆధరువులూ చేస్తున్నారు. పిల్లలు తినలేరని ఆకలికి వుండలేరని, అప్పుడప్పుడు టిఫిన్లు కూడా చేస్తున్నారు. అన్ని తింటున్నారు. కాని అనంతంకు పొట్టంతా డొలకలా అయిపోతోంది. ఎంత తిన్నా ఈ నీరసం ఏమిటి? ఆశ్చర్యంగా వుంది అనంతంకు. వీరభద్రయ్యగారు తిరిగే రోజుల్లో అనంతం వచ్చేవాడు. కంది గుండ, చారూ అన్నం తిన్నా కడుపు నిండేది కాని, మందేదికాదు. ఇంత భరించలేనంత మంట ఎల్లా వస్తోంది! ఆశ్చర్యంగా వుండేది. రోజులు చాలా భారంగా క్షణం యుగంగా గడుస్తున్నాయి. అనంతంకు పెద్ద కొడుకు జాబు వ్రాశాడు. చెల్లెల్ని వాళ్ళ అత్తగారు వచ్చి తీసుకు వెళ్ళారనీ. మీరు తొందరగా వస్తే తిరిగి చెల్లాయిని తీసుకురావచ్చుననీ! విమల అంది.




"చూడండి! ఇంట్లో పెద్దవాళ్ళు ఎవరూ లేరని పిల్లని వియ్యపురాలు తీసుకుపోయింది. పోనీ నేనన్నా వెళ్తాను. మునలాయన వ్యవహారం, తెమిలేటట్టు లేదు" అటు కన్నకూతురు ఏమి అవస్థ పడుతుందో, అత్తవారు ఏమి చెప్పుతారో అనే బాధ ఇటు కన్న తండ్రి ఏ వేళప్పుడు ఎల్లా వుంటారో అనే ఆవేదన! ఎటూ చెప్పలేక పోయేడు అనంతం.

"పోనీ అమ్మాయిని ఇక్కడకే తీసుకు రావాల్సింది" అన్నారు ఆడపడుచులు, తోడికోడళ్ళు.

"మరీ నీళ్ళాడే రోజులు దగ్గరికొచ్చేశాయి. మూడు రోజుల ప్రయాణంలో అవస్థలు పడవద్దా! నేనే వెళ్ళిపోతాను" అంది విమల. వెళ్ళమందామా, వద్దందామా అనే మీమాంసలో నాలుగు రోజులు గడిపాడు అనంతం.

"పెద్దదానికి జ్వరం వస్తోందిట! నన్ను రమ్మని వ్రాశారురా అన్నయ్యా మీ బావ! వెళ్ళి చూసి నాలుగు రోజుల్లో వచ్చేస్తాను" అంది పెద్ద చెల్లెలు.

"అక్కా! నువ్వెళ్ళితే నేనూ మా వూరు వెళ్ళి వస్తాను. నువ్వు లేకపోతే వదినల దగ్గర నేను ఒక్క నిమిషం వుండలేను" అంది చిన్నచెల్లెలు బెంగగా.

"అదేమిటే అల్లా అంటావు! మాకు లేరా ఆడపిల్లలు! మా కూతుళ్ళెల్లాంటివారో మీరూ అల్లాంటివాళ్ళే మాకు!" అన్నాడు చిన్నన్న.

"ఏమో బాబూ! వదినలంతా ముగ్గురూ

ఒకచోట చేరుతారు. వాళ్ళల్లోవాళ్ళు గుజ గుజ లాడుకుంటారు. అక్కయ్య వుంటే నేనూ అదీ ఏదో మాటామంతీ ఆడుకుంటూ గడుపుతాము" అంది చిన్నచెల్లెలు. అందరూ దేనికోసమోఎదురుచూస్తున్నారు. పైకి చెప్పలేదు. అనుకోలేరు. ముసలాయన మీదఅభిమానంవుంది. ఆప్యాయత వుంది. కాని ఎవరికివారే ఒక నిర్ణీత బ్రతుకు చట్రములో బిగించబడ్డారు. వాళ్ళ వాళ్ళ సంసారాలు వదిలిపెట్టి ఒక్కవారం, నాలుగు రోజులూ తప్పించి బయట గడపలేరు. ఇందరం వున్నాం! ముసలాయన రుగ్మత ఒక్క పిసరయినా తగ్గించలేకపోతున్నామేమిటి? ఒక కంటి చూపు చిన్న నోటి మాట తెప్పించ కలిగే మహిమ ఈ రక్త పాశంలో లేదా! అనుకునేవాడు నారాయణ. ప్రతి పూటా డాక్టరుని అడుగుతూనే వున్నాడు ఎల్లా వుంటుంది అని!

"ఎల్లా వుంటుంది అంటే ఏం చెప్పగలం! శత వృద్ధుడు! మందులు అంత త్వరగా పనిచేయవు. "వెయిట్ ఫర్ హిజ్ టైం!" అనేవాడు డాక్టరు. నారాయణ చిన్నబుచ్చుకునే వాడు.

ఇన్నాళ్ళు ముసలాయన సాహచర్యంలో జీవితంలో ఇది కావాలి అనుకోకుండానే గడిచిపోయేయి రోజులు నారాయణకి. ముసలాయన మంచాన పడడంతో అంతా తారుమారయింది నారాయణ పరిస్థితి! వీరభద్రయ్యగారు, నారాయణ జీతం తెచ్చి ఇచ్చినా అది ఇంటి ఖర్చుకి వాడుకునేవారుకాదు. సంవత్సరానికి ఏడు వందల ఇరవయికి తనో ఎనభయి రూపాయలు వేసి ఎనిమిది వందల రూపాయలూ సేవింగ్స్‌లో వేసేవారు. అల్లాగ నారాయణ డబ్బు నాలుగు వేలదాకా జతపడింది. ఇంక పదిపదిహేను రోజులకి మంచాన పడతాడనగా ఒకరోజు నారాయణ ముసలాయనకి కాళ్ళు రాస్తూ కూర్చున్నాడు మంచంమీద.

"నారాయణా! నువ్వు పెళ్ళి చేసుకోరాదురా!" అన్నారు వీరభద్రయ్యగారు. నారాయణ నిర్లిప్తంగా నవ్వాడు. తా దూర కంతలేదు మెడకో డోలని. తన జీవితానికి చాలీచాలని సంపాదనకి పెళ్ళి పెళ్ళాం సంసారం కూడానా!"


"నవ్వుతావేరా?" అన్నారు మళ్ళీ.

"నవ్వకేం చేయమండీ అన్నీ తెలుసున్నవారు మీరే నన్ను హేళన చేస్తుంటే!" వీరభద్రయ్యగారు లేచి కూర్చుని నారాయణ భుజంమీద చేయివేసి నిమిరారు.

"జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు నా అనుకునేవాళ్ళు వుంటే బాగుండును. అనే పరిస్థితి వస్తుందిరా! గంతకు తగ్గ బొంత దొరక్కపోదు. ప్రయత్నించు" అన్నారు. నారాయణ నవ్వేసి వూరుకున్నాడు. తర్వాత ఆయన తిరిగిన పది రోజుల్లోనూ నలుగురయిదుగురిని పెళ్ళి సంబంధాల గురించి వాకబు చేయటం మొదలుపెట్టారు. ఈ లోగా ఆయనకు పిలుపు వచ్చింది.

"అంతా అయిపోయింది" అన్నయ్య విన్న తర్వాత ఇంట్లో నెలరోజులుగా వున్న టెన్షనంతా సడలిపోయింది. తర్వాత కార్యక్రమాలన్నీ ఆఘమేఘాలమీద జరిగిపోయాయి. వున్నచారెడు కొంపా పిల్లలు ఎవళ్ళూ వచ్చి ఆ వూళ్ళో వుండరు కనుక, అమ్ముకున్నా వచ్చేడబ్బు పిల్లలంతాపంచుకున్నా ఆ డబ్బు వాళ్ళకి పెద్దలెక్కలోది కాదుకనుక, తనని ఇన్నిరోజులూ కనిపెట్టుకుని వున్నందుకు నారాయణకి చెందవచ్చునని వ్రాసేసేడు ముసలాయన.

"ఇంతోటి ఎస్టేటుకి పెద్ద లాయరుగారి దగర వీలునామా వ్రాయించడం దేనికీ! ఎవరం ఆశించాం కనుక?" అంది రెండో కోడలు.




"ఎవరి దగ్గర ఒక దమ్మిడీ కాఫీ త్రాగి ఎరుగరు మహానుభావులు! తన కర్తవ్యం-క్రింది పిల్లలని పెంచి పెద్దచేశారు. తన కాలం కోసం ఆగారు-వెళ్ళారు" అంది లలిత.

'ఎంత పెద్దింటి కోడళ్ళమయినా పుట్టింటి ఆశ వుంటుంది. అన్నతమ్ముళ్ళున్న మీరంతా ఎవళ్ళు వుండాల్సిన స్థానంలో వాళ్ళు వుంటున్నారు. కాస్తో కూస్తో ఆడపిల్లలకే చెందేట్లు వ్రాస్తేఆయన ధర్మబుద్ధికన్పించేది.' అందిచిన్నకూతురు

అనంతంకు పెద్ద బాధ అన్పించలేదు. తండ్రి తన బాధ్యతలు ఏవీ ఇతరులకు అప్పగించలేదు. వున్నదాంట్లో అందరు పిల్లలూ సుఖపడేటట్లు తీర్చి దిద్దారు. తను చివరిదాకా ప్రశాంతంగా, హాయిగా జీవించారు. తనకు మిగిలినదాంట్లో తనని నమ్ముకున్న నారాయణకి కూడా మంచి ఏర్పాటు చేశాడు. "ఇన్నిరోజులూ కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళూ రాలేదని అనుకోకుండా, ఆ లోటు కన్పించనీయకుండా ఆయన మంచిచెడ్డలన్నీ భరించాడు. ఆ కాస్త ఇల్లూ తన తండ్రి నారాయణకియ్యటం మూలంగా తాము చెడిపోయిందేమీలేదు అనుకున్నాడు. అన్నీ సక్రమంగా జరిగాయి. ఉన్న తమ్ముళ్ళు ఏమీ పట్టించుకోకపోయినా కూతుళ్ళూ, కోడళ్ళూ మటుకూ ఇంట్లోవున్న సామాన్లమీద పడ్డారు.

"ఈ బిందె తేలిగ్గా వుంది. మడినీళ్ళు ఎత్తి పెట్టుకుందుకు వీలుగావుంది"అంటూ విమల ఒక బిందె వేరుగా పెట్టింది.

"నాన్నగారు వాడుకున్న కంచం. ఆయన పేరు మీదుగా మా మనమరాలికి దాస్తాను. ఏమీ అనుకోకు నారాయణా! అంటూ పెద్ద కూతురు ఒక స్టీలు కంచం లాగింది. ఈ టబ్బు బాగుందనీ, ఆ చెంబులు పిల్లలు వాడుకుంటారనీ అందరూ తలొక వస్తువూ వేరువేరుగా వుంచటం మొదలు పెట్టారు. అనంతంకు విరక్తిలాంటిదేదో కలిగింది. వీళ్ళంతా మనుష్యులేనా! మానవత్వం వుందా! తండ్రి మంచంమీద వున్నన్నిరోజులూ, తామేదో పెద్ద సేవచేసేవాళ్ళల్లా చుట్టూ చేరారు. ఆయన మందు బలంవల్ల అయితేనేం, నారాయణసేవా శుశ్రూషల వల్లయితేనేం, కాలం రాక అయితేనేం కొన్నాళ్లు మంచంమీద వున్నారు. అందరూ కూడా తాము తమ సంసారాలు వదిలి వచ్చినందువల్ల తమ జీవితాలే కొల్లబోతున్నట్లుగా చిటచిటలాడారు. అలా చేస్తే బాగుంటుందా ఇలాచేస్తే బాగుంటుందా అని తర్జన భర్జనలు మొదలుపెట్టారు. ఎలా

అయిననేం ముసలాయన [illegible]ధి నిష్క్రమణం జరిగింది! ఇంక అంద[illegible] ఒకటే హడావిడిపడుతున్నారు. ఇన్ని రోజులూ ఈ బిందెలూ, బల్లలూ, కుర్చీలూ లేకుండా వీళ్లు సంసారాలు చేయటం లేదా! మనిషి బ్రతుకుకు లేని విలువ, చైతన్యానికి లేని విలువ ఈ జడ పదార్థాలకు వుందా? వుండేవుంటుంది! ఏమంటే బిందెలు, చెంబులూ, బల్లలూ, కుర్చీలూ, విరిగిపోయినా, చిల్లులు పడినా మళ్ళీ మళ్ళీ అతుకులు పెట్టించో, మాట్లు పెటించో వాడుకోవచ్చును. మరీ పనికిరాకపోతే బిందెలు మార్చి గిన్నెలూ, గిన్నెలు మార్చి చెంబులూ చేయించుకుని వాడుకో వచ్చును. కాని మనిషి అలా కాదే! జడము అయిన మనిషి శరీరము దేనికి పనికివస్తుంది ?

తనూ పెద్దవాడవుతున్నాడు తనకీ నలుగురు పిల్లలున్నారు. ఇన్నాళ్ళూ వాళ్ళ ముద్దు ముచ్చటలతో చదువు సంధ్యలు చూడటంతో ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేయటంతో తన జీవితం గాలపింగ్ స్పీడ్‌తో నడిచింది. ఇంక ఎంతంతవాళ్ళు అవుతారు. ఎవళ్ళ సంసారాలు వాళ్ళకి ఏర్పడుతాయి. అప్పుడిక తానూ, తన కాలం కోసం ఎదురుచూస్తూ కూర్చోవాలి! పిల్లలకి తను ఏమి సంపాదించాడు? ఎంత ఖర్చు పెట్టాడు? ఆ ఖర్చులు సవ్యమైనవా. అపసవ్యమైనవా? అనే పేరీజులే కావాల్సి వస్తాయి. తమ కోసం ఏమి మూటలు దాచాడో అనే ఆరాటం. దాచకపోతే ఏమీ దాయలేదే అనే ఆవేశం తప్ప ఒక మనిషి ఆయన ఆరోగ్యంగా వుండాలి మనతో సమంగా ఆయనకూడా సుఖపడాలి. అన్న ఆర్ద్రత వుంటుందా! పిల్లలు లేరు లేరు అని ఎంతోమంది పిల్లలు లేనివాళ్ళు బాధలుపడతారు. పూజలు చేసి, వ్రతాలుచేసి పిల్లలకోసం తపించి తపించి కంటారు. పిల్లలు లేరంటే అదోవెర్రి! ఎందుకు? వాళ్లు తమతో ఎందాక వస్తారు! ఎందాకా రాగలరు! ఈ కుటుంబాలు, సంబంధాలు బాంధవ్యాలూ అన్నీ వింతయిన మోహాలు తప్ప లోపలికి తరిచిచూస్తే ఏనుగుతిన్న వెలగపండులా అంతా డొలకలాకన్పించుతుంది. ఎంత వింతయింది మానవ ప్రకృతి. సమస్త ప్రాణికోటిలోనూ సహజమయిన కరుణాభావం వుంది. మానవుల్లో మటుకు స్వార్థం తర్వాతనే ఏ ఆర్ద్రత అయినా ముఖం ఎత్తగలదు అనుకున్నాడు. అందరూ ప్రయాణాలు అయినారు. మూడు వంతులు ఇంట్లో వున్న సామాన్లు అన్నీ మూటలుకట్టి ఇల్లు ఖాళీ చేశారు. నారాయణ స్టేషన్ దాకా వచ్చాడు, అనంత నారాయణ భుజంమీద చేయి వేశాడు. ఆనకట్ట తెగినట్లు నారాయణ పసిపిల్లవాడిలా బావురుమన్నాడు.

## ఎదగని బతుకులు

గాలి సంగీతానికి తల ఊపడం
మహా వృక్షాలకు సంతోషంగా ఉ[illegible]
భ్రమరాలకు మెప్పు అందించడం
పూతీగెలకు సరదా అవచ్చు!
కానీ,
బతుకెదుగని ఈ గరికె పరకలకు
జీవించడమే ఒక యుద్ధం!
యుద్ధం జోలికి
సంగీతాలు రావు!
శృంగారం అంతకన్నా రాదు!!

—గుడిహాళం రఘునాథం

"ఊరుకో! ఏమిటీ మరీ పిచ్చి!" అన్నాడు అనంతం. అన్నాక తన ఓదార్పుకు తనే విస్తుపోయాడు. తను ఏడ్వదు మంటే నారాయణ ఓదార్చాల్సినమాట! అలాంటి తారుమారు ఎందుకు జరిగింది! ఇన్నాళ్ళూ తాము తమ తమ సంసారాల్లో పీకలదాకా కూరుకుపోయి వున్నారు. అందువల్లే తండ్రికి జబ్బు చేసినా మంచంమీద వున్నా. అవతల తమ ఉద్యోగాలు సద్యోగాలు ఏమవుతాయో? పిల్లా జెల్లా ఏం చేస్తున్నారో అనే యావతప్ప పెద్ద కాలమయిన తండ్రి శారీరకంగా ఎంత బాధపడుతున్నాడో అనే తపన తమలో కలగలేదు. నారాయణ ఆయన్ని అంటిపెట్టుకుని వున్నాడు. ఆయన లేనిలోటు అతన్ని కదిలించినట్లు తమని కదిలించలేదు. అందుకనే తను బావురుమనలేకపోయాడు!

"నారాయణా! బెంగ పెట్టుకోకు! ఇంకనయినా యెవరినైనా ఒకరిని తోడు తెచ్చుకో!" అన్నాడు అనంతం. మనసారా దుఃఖించటానికి కూడా అర్హత వుండాలేమో అనుకున్నాడు అనంతం!

"మీకు తెలియదు! ఆయన నన్ను ఎంతగానో ఆదరించారు. ఒక్కరోజన్నా విసుగుకోలేదు. కాళ్ళీడ్చుకుంటూ తిరిగే నన్ను చూసి ఈ వూళ్ళో అందరూ నిర్లక్ష్యం చేసినా ఆయన నన్ను లేకలేక కలిగిన ఏకైక పుత్రుడిలా చూసేవారు. ఇంకా ఏం చేశారో తెలుసా?" అన్నాడు వెక్కెక్కి పడుతూనే. "ఏం చేశారు!" అన్నాడు కుతూహలంగా అనంతం.

"నా జీతం ఒక్క కానీ అయినా ఆయన క్రింద కానీ, నా క్రింద కానీ ఖర్చుపెట్టలేదు. అంతా ముద్రశుద్ధిగా నా పేర బాంక్‌లో వేశారు! ఇదెంత అన్యాయం! అయినా నేనూ. నాకు ఆయనా అనుకున్నాను. నన్నింతకాలంత వేరు చేశారో అని నాకు భరించలేనంత బాధగా వుంది" అన్నాడు. కళ్ళవెంట నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి నారాయణకు. "ఎంత పిచ్చివాడివి! నిన్ను ఆయన వేరు చేశారా! నీ భవిష్యత్తుకి కొంత ఆధరువు చూపించారు. ఎవరయినా ఇన్నాళ్ళు సేవ చేశాను. అన్నాళ్ళు సేవ చేశాను. నాకేమి యిచ్చిపోలేదు అనుకుంటారు. కడుపున రక్తం పంచుకుని పుట్టిన బిడ్డలయినా తల్లితండ్రులు చనిపోతే అక్కకి ఎక్కువ ఇచ్చారని తమ్ముడూ, తమ్ముడ్ని బాగా చూశారని అన్నలూ అనుకుంటూంటారు. వాడీ, వేడీ వున్నవాళ్లయితే తిట్టుకుని కుమ్ముకుంటారు కూడా! నిన్ను ఆయన వేరుగా చూసి వుంటే నీకీ రోజు యిన్ని కన్నీళ్ళు రానేరావు నారాయణా" అన్నాడు. నారాయణ కళ్ళు తుడుచుకున్నాడు. రైలు వచ్చే సూచనగా గంట కొట్టారు. అనంతం నారాయణ వీపు తట్టి.

"చప్పున పెళ్ళికొడుకువి అవ్వాలి! లేకపోతే నేను రిటయిరయినాక నీదగ్గరకే వస్తాను" అన్నాడు అనంతం రైలు ఎక్కబోతూనూ. నారాయణ మౌనంగా నమస్కరించాడు.

ఒక స్థితికి వచ్చాక మనుష్యులకి చెయ్యాల్సిన పనులేవీ కన్పించవు కాలం కోసం ఎదురుచూస్తూ కూర్చోవటం తప్ప! అలాంటి స్థితిలో కూడా. తను కూడా ఒకరికి పనికి వస్తాడు అనే భావం ఒక మనిషిలో కల్పించారు వీరభద్రయ్య! ఆరిపోయే దీపంతో కొత్త దీపం వెలిగించినట్లు చరమదశలోవున్న వీరభద్రయ్య నారాయణలో ఒక జీవితాసక్తిని, సామాజిక స్పృహని నవ చైతన్యాన్ని కలిగించకలిగాడు! అనుకున్నాడు అనంతం! తండ్రి వరవడినే తనుకూడా రిటయిర్డ్ లైఫ్‌ని గడపాలి అన్న నిశ్చితాభిప్రాయం కూడా అతనిలో వెంటనే కలిగింది.

